క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.6,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షాహిన తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రాలతో ప్రతిష్ఠలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీ పరిధి కొత్తపద్మగూడెం రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన పదిహేను కుటుంబాల వారు పినపాక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ముత్యంబాబు, అడపా అప్పారావు, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో..

అశ్వారావుపేట: నందమూరి కాలనీ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువకులు సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ సభ్యుడు జేష్ఠ సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగగా పార్టీలో చేరిన వారిలో అనిల్ కృష్ణ, స్వామి, టైసన్, ఇస్రాయిల్ తదితరులున్నారు.

పార్టీ అభివృద్ధిపై నాయకులతో చర్చ

భద్రాచలం: ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును భద్రాచలం ఆ పార్టీ నాయకులు మంగళవారం మణుగూరులో కలిశారు. భద్రాచలంలో పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఇతర సమస్యలను చర్చించారు. రేగాను కలిసిన వారిలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కె.కృష్ణమూర్తి, బల్లా రాంబాబు, చింతాడి చిట్టిబాబులు ఉన్నారు. అదేవిధంగా బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తమ మహిళా ఉద్యోగులకు సత్కారం ఉందని, పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తుమ్మల దంపతుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దంపతులు

దమ్మపేట: మండల పరిధిలోని గొర్రెగుట్ట గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు దంపతులు సందర్శించారు. మంగళవారం జరిగిన స్వామివారి కల్యాణ వేడుక మహోత్సవంలో పాల్గొన్న తుమ్మల దంపతులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు కాసాని నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంగ్రామ యాత్రను జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: శ్రీరాముడి సాక్షిగా బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఎస్సీల వర్గీకరణ హామీని నెరవేర్చడంలో నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఈ నెల 9వ తేదీ నుంచి భద్రాచలం నుంచి జరిగే మాదిగల సంగ్రామ యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కోకన్వీనర్ కొప్పుల మాదిగ మంగళవారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెన్నం కృష్ణ, కొరె రాము, పూస ఎల్లయ్య, గద్దల రాజు తదితరులు పాల్గొన్నారు.

భువికి చేరిన హరివిల్లు

రంగుల కేళీ.. హోలీ వేడుకలు మంగళవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. చిన్న, పెద్ద, ముసలి, ముతక తేడాలేకుండా ప్రజలు రంగులు చల్లుకున్నారు. చెక్కిలి తాకిన రంగులు, దేహం తడిపిన రంగునీరు దృశ్యాలు నింగిలోని హరివిల్లు నేలకు చేరిందా అన్నట్లు కనిపించాయి. గల్లీగల్లీనా యువత సందడి చేసింది. చిన్నారులు హోలీ ఆడినతీరు ఆకర్షణగా నిలిచింది. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా వేడుకల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు. అందరికీ మిఠాయిలు పంచారు. కార్యాలయాల్లోని సిబ్బంది. పార్టీల నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని భాగస్వాములయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: పట్టణంలో రంగులు చల్లుకుంటున్న యువకులు



అశ్వారావుపేటరూరల్: మామిళ్లవారిగూడెం వీధుల్లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



మణుగూరురూరల్: కార్యకర్తలకు రంగులు పూస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు



దుమ్ముగూడెం: హోలీ సంబరాలు చేసుకుంటున్న యువకులు



మణుగూరుటౌన్: హోలీ సంబురాల్లో సింగరేణి అధికారులు



ములకలపల్లి: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



మణుగూరుటౌన్: హోలీ వేడుకల్లో యువకుల జోరు..



బూర్గంపాడు: హోలీ సంబరాల్లో చిన్నారులు



చండ్రుగొండ: సంబురాల్లో యువకుల కేరింత..



చర్లలో చిన్నారులు..

కార్యాలయం కార్యరూపం దాల్చేనా?

- పెండింగ్‌లో ఆర్టీఓ ఆఫీస్ నిర్మాణం
- ప్రకటనలు గుప్పించినా ఆచరణకు నోచుకోని వైనం
- స్థానికులకు తప్పని ఎదురుచూపులు



కార్యాలయ ఏర్పాటుకు కేటాయించిన స్థలం ఇదే..

మణుగూరురూరల్: మణుగూరు పట్టణం పారిశ్రామికంగా, వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. అందులో భాగంగా ఇక్కడ వాహన రాకపోకల తాకిడి ఎక్కువగానే ఉంది. అదే క్రమంలో అభివృద్ధి చెందుతున్న మణుగూరు పట్టణంలో ద్విచక్ర, త్రిచక్ర, భారీ వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. ప్రస్తుతం వాహనాలను ప్రభుత్వ పరంగా ప్రభుత్వ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కోసం భద్రాచలం పరిధికి వెళ్లాల్సి వస్తోంది. మణుగూరులోనే ఆర్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలపడంతో మణుగూరు మండల ప్రజలతో పాటు మణుగూరు నుంచి జానంపేట వరకు పలు గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కానీ అది ప్రకటనలకే పరిమితమైంది. కానీ నేటి వరకూ ఆర్టీఓ ఆఫీస్ ఏర్పాటు ఆచరణకు నోచుకున్నది లేదు.

కొలిక్కిరాని స్థల సమస్య..

ఈ పరిస్థితికి కారణాలు లేకపోలేదు. మణుగూరులోని గుట్టమల్లారం ప్రాంతంలో ఆర్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు.. అందుకు స్థలం కేటాయించినట్లు ప్రకటిస్తూ.. గతంలో గుట్టమల్లారంలోని ప్రభుత్వ స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే ఆ స్థలం తమ పట్టాభూమని కొందరు స్థానికులు అడ్డుకున్నారు. తమ స్థలం ఆర్టీఓ ఆఫీస్ ఎలా నిర్మిస్తారంటూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు మద్దతు పలికారు. కాంగ్రెస్ జిల్లా ప్రముఖ నాయకులు సైతం దీక్షా శిబిరాన్ని సందర్శించారు. మరోవైపు మణుగూరు రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలమేనని, ఆర్టీఓ కార్యాలయాన్ని ఇక్కడే నిర్మిస్తామని తేల్చిచెప్పారు. ఈ స్థలంలో ఎవరైనా ఇళ్లు నిర్మించదలిస్తే అది చట్టరీత్యా నేరమని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ పరిణామాలన్నీ ఇప్పటికి కొంత చల్లబడినప్పటికీ కార్యాలయ ఏర్పాటు పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

నిధులు కేటాయించేనా?

ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ నిర్మాణానికి అడ్డంగులు తొలగించి, నిధులు కేటాయిస్తారని స్థానికులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు రూ.100 కోట్లు ప్రకటించిన నేపథ్యంలో.. ఆ నిధులు ఆర్టీఓ నిర్మాణానికి సైతం కేటాయిస్తారా లేదా అని ఎదురుచూస్తున్నారు.

చర్యలు చేపట్టాలి

మణుగూరులో వెంటనే వాహన తనిఖీ కార్యాలయ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. వాహన రిజిస్ట్రేషన్, ఇతర సేవల కోసం భద్రాచలం వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే దూరభారమవుతోంది. మణుగూరులో వాహన తనిఖీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే వాహన యజమానులకు సులభతరం అవుతుంది.

– చింతపల్లి జగన్, మణుగూరు

సేవలను అందుబాటులోకి తేవాలి

వాహన రిజిస్ట్రేషన్, లైసెన్సులు, ఇతర సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి పొందాల్సిన పరిస్థితి ఉంది. మణుగూరు కేంద్రంలో ఏర్పాటు చేస్తే వాహనదారులందరికీ, కొత్తగా వాహనాలు కొనుగోలు చేసే వారికి కార్యాలయ సేవలు ఉపయోగపడతాయి. తద్వారా దూరభారం కూడా తగ్గుతుంది.

– చప్పిడి రామకృష్ణ, మణుగూరు

అటెన్షన్ ప్లీజ్

పందుల సంచారం..



మణుగూరు మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో సైడ్ డ్రెయిన్లు మురుగునీటితో నిండి ఉంటున్నాయి. దీనివల్ల పందులు భారీ సంఖ్యలో సంచరిస్తున్నాయి. స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో చిన్న పిల్లలపై పందులు దాడి చేసి గాయపరిచిన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా సమితిసింగారం పాలకవర్గం స్పందించి మురికినీటితో నిండి ఉన్న డ్రెయిన్లను శుభ్రపరిచి పందుల సంచారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి, సమితిసింగారం
ఫోన్ నంబర్: 8341616359

సిద్ధమైన ఎంవీఐ కార్యాలయం

అశ్వారావుపేట: జిల్లాల విభజన కారణంగా సత్తుపల్లిలో అందుతున్న ఎంవీఐ కార్యాలయ సేవలు కొత్తగూడెంకు మారడంతో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. పలు ప్రజాసంఘాల వినతుల ఫలితంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో అశ్వారావుపేటలో ఎంవీఐ కార్యాలయం ప్రారంభం కానుంది. ఇందుకోసం మండల పరిషత్ పాత ప్రాంగణంలో అదనపు గదుల భవనాన్ని ఎంవీఐ కార్యాలయంగా ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి బోర్డులను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటికే రవాణాశాఖ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు అశ్వారావుపేటలో నిర్వహిస్తున్నారు. కాగా చెక్‌పోస్టు సిబ్బందితో కార్యాలయ నిర్వహణ ఉంటుందా..? లేక కార్యాలయ సిబ్బందిని ఇతర కార్యాలయాల నుంచి డిప్యుటైజేషన్‌పై కేటాయిస్తారా..? లేక వారానికి కొన్ని రోజుల పాటు ఈసేవలు అందుతాయా.. అనేది కార్యాలయం ప్రారంభించిన తర్వాత తెలియనుంది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ నాయకుల నుంచి సమాచారం. అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది.



అశ్వారావుపేట ఎంవీఐ కార్యాలయం..

ద్విచక్రవాహనం చోరీ

అశ్వాపురం: మండలంలోని బీజీ కొత్తూరు గ్రామంలో వార్డు సభ్యుడు కొల్లు ఉప్పల్‌రెడ్డి స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామంలో తన పొలం సమీపంలో టీఎస్ 28ఎఫ్5337 నంబర్ గల స్కూటీని నిలిపి ఉంచాడు. అనంతరం ఉప్పల్‌రెడ్డి పొలంలో పనులు చేస్తుండగా స్కూటీని చోరీ చేశారు. దీంతో ఉప్పల్‌రెడ్డి అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా గ్రామంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి ట్రాక్టర్ కల్టివేటర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మల్లారెడ్డి సైతం ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాలనలో సత్తా చాటుతున్న మహిళలు

- అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు వీరివే..
- ఆరుగురు ఎంపీటీసీల్లో నలుగురు మహిళలే..
- తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సై, ఏఓ, వైద్యాధికారి వీరే..
- పాలనలో ఉత్తమ మండలంగా ఎంపిక



భారత లాలమ్మ జెడ్పీటీసీ సభ్యురాలు



భద్రకాళి తహసీల్దార్



రేవతి, ఎంపీడీఓ



షాహిన, ఎస్సై



అనూష, ఏఓ



షాబ్నా, ఎంపీఓ



ప్రియాంక వైద్యాధికారి



ప్రమీల, ఏపీఓ



సున్నం లలిత ఎంపీపీ

అన్నపురెడ్డిపల్లి: నూతనంగా ఏర్పాటైన అన్నపురెడ్డిపల్లి మండలంలో పాలకులుగా మహిళలే అధికంగా ఉన్నారు. ఇక్కడ మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అంతా మహిళలే. మహిళామణుల పాలనలో మండలం అభివృద్ధి పథంలో విజయవంతంగా ముందుకు సాగుతోంది. అన్నపురెడ్డిపల్లి మండలం జిల్లాలో ఉత్తమ మండలంగా ఎంపికై, అవార్డు సొంతం చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. మహిళా ప్రజాప్రతినిధులు, అధికారుల జాబితాను పరిశీలిస్తే.. ఎంపీపీగా సున్నం లలిత, జెడ్పీటీసీ సభ్యురాలుగా భారత లాలమ్మ, తహసీల్దార్‌గా భద్రకాళి, ఎంపీడీఓగా రేవతి, ఎస్సైగా షాహిన, ఎంపీఓగా షాబ్నా, ఏఓగా అనూష, వైద్యాధికారిణిగా డాక్టర్ ప్రియాంక, ఏపీఓగా ప్రమీలతోపాటు మండలంలోని మొత్తం 6 గురు ఎంపీటీసీలకు గాను 4గురు మహిళలు, 10 పంచాయతీల్లో 5 పంచాయతీకు మహిళా సర్పంచ్‌లు ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్నారు: ఎంపీపీ

ఈ విషయంపై ఎంపీపీ సున్నం లలిత స్పందిస్తూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దీనికి ఉదాహరణ తమ మండలం అన్నపురెడ్డిపల్లి అని వ్యాఖ్యానించారు. ఇక్కడ ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా మహిళలే ఉన్నారని, అందరూ సమన్వయంతో పని చేయడం వల్ల మండలం అభివృద్ధి చెందుతోందని అన్నారు.

అవకాశాలు కల్పిస్తే సత్తా చాటుతారు: జెడ్పీటీసీ

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించినప్పుడు వారు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించి ఉన్నతశిఖరాలకు చేరుకుంటారని, తమ సత్తాచాటుతారని జెడ్పీటీసీ భారత లాలమ్మ అభిప్రాయపడ్డారు. దీనికి ఉదాహరణ తమ మండలం అన్నపురెడ్డిపల్లినే అని, మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందు ఉంచుతున్నామని అన్నారు. మండలంలోని మహిళ ప్రజాప్రతినిధులు, అధికారులంతా సమన్వయంతో పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.

కల్యాణ వైభోగమే...

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామంలో గోదావరి నదీ తీరాన అదిశేషావతార వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అంకురార్పణ విశ్వక్షేన పూజ చేసి స్వామి వారిని పెళ్లి కుమారునిగా అలంకరించారు. ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణతంతు కొనసాగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. మండలంలోని దేవానగరంలోని ఆలయంలో అలివేలు, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని కుదునూరు గ్రామంలో సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదానం, స్వామి వారు అమ్మవార్లను ఊరేగించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ సభ్యుడు దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వేడుకగా సాగింది. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పందిరిలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు కల్యాణ క్రతువు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వేణుగోపాలస్వామి కల్యాణం..

ఇరవెండిలోని సంతాన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. రుక్మిణీ, సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతుల చేత కల్యాణ క్రతువు నిర్వహించారు. సంతానం లేని దంపతులకు గరుడముద్దలను పంపిణీ చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నసమారాధాన నిర్వహించారు. కల్యాణోత్సవంలో జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత దంపతులు, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు దంపతులతోపాటు పలువురు తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామపంచాయతీలోని టేకులగుట్ట గ్రామ శ్రీ కృష్ణుడు ఆలయం ఆవరణలో రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ కల్యాణాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, గణపతి హోమం అనంతరం వేదమంత్రాల మధ్య కల్యాణ కార్యక్రమం వైభవంగా సాగింది. ఎంపీపీ ముత్తినేని సుజాత, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ గాదెల జయతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ నానిబాబు, ఉపసర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.



చర్ల: కుదునూరులో వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం..



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో అద్భుత వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



మణుగూరురూరల్: స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు



దుమ్ముగూడెం: కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు